# రేపటి మహిళ



'సిద్ధార్థా ... నేను కాసేపు రెస్ట్ రూంకి వెడతాను. కేస్ వస్తే పిలువ్... మా పి.జి. డాక్టర్ విశ్వం నిద్ర ఆపుకోలేనట్టు అన్నాడు. ఇంట్లో ఎవరికో బాగా లేదని ఫోన్ వస్తే వెళ్ళారు మా డ్యూటీ అసిస్టెంట్ డాక్టర్ మహేష్.

అర్ధరాత్రి 2 గంటలు దాటుతోంది. అలవాటుకి భిన్నంగా ఈ రోజు కాజువాలిటీ నిశ్శబ్దంలో మునిగితేలుతోంది.

కిటికీ దగ్గర నిలబడ్డాను. బయట ప్రకృతి అంతా చల్లగా వుంది. నీలినీలి ఆకాశ దేశాన్ని వెలిగిస్తూ జరీ దీపంలాగా మెరుస్తున్నాడు చందమామ.

హఠాత్‌గా ఆ ప్రశాంతతని చెదరగొట్టేస్తూ ఘొల్లున ఏడ్పులు... వెనకగా పది మంది జనం తోసుకుంటూ కేజువాలిటీ లోపలికి వచ్చేశారు. వాళ్ళ హడావుడికి లేచి వచ్చిన మా పి.జి. విశ్వం నేనూ ఒకేసారి ఐ.సి. రూమ్‌లోకి వెళ్ళాం. వాళ్ళ చేతుల్లోంచి ముద్ద కట్టుకుపోయిన స్త్రీ ఆకారాన్ని బెడ్ మీదకి చేర్చారు సిస్టరు వార్డుబోయ్. ఆమె శరీరంలో ఒక్క ముఖం తప్ప అగ్నికి ఆహుతవని భాగం లేదు. కాలి కాలి భయంకరంగా బొబ్బలు లేచాయ్.

గాడ్... విశ్వం కంఠంలో ఆందోళన తొంగి చూసింది. 80 పర్సెంట్ బర్న్స్'

'సిస్టర్... త్వరగా డాక్టర్ మహేష్ గారికి ఫోన్ చెయ్యండి... సెలైన్ ... సిద్ధూ క్విక్...'

పది నిముషాల్లో అసిస్టెంట్ వచ్చేశారు. అప్పటికే అవసరమైన ఇంజక్షన్స్ ఇచ్చి సెలైన్ స్టార్ట్ చేశాం. ఆయన వస్తూనే పేషెంట్‌ని చూసి లాభం లేదన్నట్టుగా తల వూగించారు. అయినా చివరిగా ఆక్సిజన్ మాస్క్ తగిలిస్తూ మా ప్రయత్నాలు మేం చేస్తున్నాం.

గుమ్మం దగ్గర బూట్ల శబ్దంతోపాటు లాఠీ చిన్నగా తలుపు మీద తట్టి విష్ చేస్తూ లోపలికి వచ్చాడు ఎస్.ఐ.

సార్... ఈమెకి స్పృహ వస్తుందంటారా... [illegible]రిగా అడిగి ఏం లేదు మా ఫార్మాలిటీస్.. గొణు[illegible]న్నట్టుగా అన్నాడు.

యాక్సిడెంట్ ఎలా జరిగిందిటా...' కేస్ కాగితాల మీద సంతకాలు పెడుతూనే అడిగారు మా చీఫ్.

'కట్నం కేస్‌మో సార్...' ఆడ గుండెతో ఫప్పున స్పందించింది నర్స్.

అలా కాదుట సార్. ఆయన చాలా మంచోడు. (పెళ్ళాని పువ్వుల్లో పెట్టి చూసుకునే వాట్ట). ఈమెగారు అత్తమామల్ని చూడవద్దనీ ఆళ్ళకి డబ్బులు పంపిచ్చొద్దనీ గొడవచేసేదిట. ఆ దోళ్ళు కదండీ... బెదిరించడానికి కిర్సనాయిల్ ఒంపుకుని అగ్గెట్టుకుందిట పూర్ లేడీ...'

ఎస్.ఐ. మాటల్లో అప్పుడే కేస్ డిసైడ్ చేసేసి ఫైల్ క్లోజ్ చేసే వుద్దేశం కన్పించి విశ్వం నేనూ అర్థవంతంగా మొహాలు చూసుకున్నాం.

"ఈవిడకి స్పృహ రానీండి. అసలు సంగతి తెలుస్తుంది" సిస్టర్ అక్కసుగా అంది. నాకెందుకో సడెన్‌గా ఎస్.ఐ. జస్వంత్ సింగ్ గుర్తొచ్చాడు.

సరిగా ఇలాంటి కేస్‌లోనే ఆ అమ్మాయి మరణ వాంగ్మూలం రికార్డు చేసుకుని భర్తనీ అత్తగారినీ కటకటాల వెనక్కి తోసిన నేరానికి వారం తిరక్కుండా అడవులకి బదిలీ అయిపోయిన సింగ్ నిజాయితీకి దొరికే ప్రతిఫలం అదే మరి.

తెల్లవారుతోంటే స్పృహలోకి రాకుండానే ఈ లోకం విడిచి వెళ్ళింది ఆ అభాగ్యురాలు. పోస్ట్ మార్టమ్ కోసం కాయితాలు రాసిచ్చి శవాన్ని మార్చురీకి పంపి విశ్వం నేనూ మానసికంగా మొద్దుబారినట్టుగా అయ్యాం. (ఆ రోజంతా రూమ్‌కి వెళ్ళాలన్పించక విశ్వంతోనే వుండి పోయాను.) చివరి శ్వాస వరకూ మరణయాతన అనుభవించి వంకరలు తిరిగినట్టుగా అయిన ఆ యువతి మొహం చాలా కాలం పాటు నన్ను



వెంటాడింది.

కాలేజ్ నుంచి రూమ్‌కి వచ్చేసరికి మా టెర్రస్ అంతా హడావుడిగా వుంది. కారుల్లోంచి దిగుతోన్న ఆడవాళ్ళు అందాల పోటీలకి లాగా అలంకరించుకుని వున్నారు. గుమ్మం దగ్గర నన్ను చూస్తూ సరళక్క పరుగు పరుగున వచ్చింది.

'ఏం అనకోకు సిద్ధూ.. మా మహిళా మండలి మీటింగ్ మనింట్లో చోటుచాలదని టెర్రస్ మీద ఎరేంజ్ చేశా... బంగారు తండ్రివి కదూ..ఒక్క గంట పాటు బయట తిరిగి రా...' నా చేతుల్లోంచి ఏప్రానూ, పుస్తకాలు తీసుకొని గిరుక్కున వెళ్ళింది.

మా యింటి యజమానురాలు వర్ధనమ్మగారు. ఆవిడ మనవరాలే సరళ. భర్త దుబాయ్‌లో ఇంజనీరు. ఆయన తిరగొచ్చే వరకూ కాలక్షేపం కోసం ఆడపిల్లల స్కూలు మొదలుపెట్టి తన ఎమ్.ఇ.డి. డిగ్రీని సార్థకం చేసుకుంటోంది. వర్ధనమ్మగారి కుటుంబం స్వాతంత్ర్య సమరంలో మరుగ్గా పాల్గొని ఆస్తిపాస్తులు కొంత కరగబెట్టుకున్నారు. స్వయంగా ఆవిడ దండి సత్యాగ్రహంలో జైలుకి వెళ్ళారట కూడా. అవన్నీ కథలు కథలుగా చెప్తోంటే ఎంతటి వాళ్ళూ మైమరచి వినాల్సిందే. (వాళ్ళిద్దరూ నాకు ఆత్మబంధువులు. ఈమధ్య సరళక్కని మహిళా మండలి వాళ్ళు గొడవ చేసి మరీ ప్రెసిడెంట్‌ని చేశారని చెప్పింది. దాని తాలూకు హంగామా అనుకుంటా ఇది.)

జేబుల్లో చేతులు పెట్టుకుని మెల్లగా నడక సాగించాను. దూరానికే మైక్‌లోంచి మహిళా మండలి ఉపన్యాసాల జోరు హోరెత్తిం చేస్తోంది. ఆ రాత్రి పదయ్యిందని వేరుగా చెప్పనవసరం లేదు.

ఉదయాన్నే దిగి వచ్చి మరీ సరళక్కతో వాదం వేసుకున్నాను. తను ఆడవాళ్ళమీద ఈగని కూడా వాలనీయదు.

'మీరు వూరికే... మహిళా మీటింగ్స్ పెట్టి మగవాడి జులుం గురించి ఆడిపోసుకుంటారు గానీ, మీ ఆడవాళ్ళ సంగతెలా వుందో.. నే చెప్తాను వినండి. మొన్న మాకో బర్న్స్ కేసొచ్చింది. భర్త తన వాళ్ళని చూస్తున్నాడని కోపం వచ్చి ఒళ్ళు కాల్చుకు చచ్చిపోయింది ఓ ఇల్లాలు..' నా మాటలు పూర్తి కానే లేదు. ''అందుకే అబ్బాయ్... పూర్వం వాళ్ళు ఒట్టినే అన్నారుటోయ్ స్త్రీ స్వాతంత్ర్య మర్హతి అనీ... ఆడదాన్ని చెప్పుక్రింద తేలులాగా అణిచి వుంచాలి తప్ప... పెత్తనం ఇవ్వావో కొరివై కూర్చుంటుంది...'' పక్క వాటాలోకి కొత్తగా అద్దెకి వచ్చిన ఆఫీసరు రాజేశ్వరావ్ తనవెవరో ఆహ్వానించినట్టుగా వచ్చి కల్పించుకున్నాడు. ఆయన మాట్లాడే ప్రతి పది మాటల్లోనూ ఆరు ఆడవాళ్ళని కించపరుస్తూ నాలుగు కులతత్వం జీర్ణించుకునే వుంటాయ్.

'మీకు అంతకన్నా సంస్కారంగా మాట్లాడటం రాదనుకుంటాను...' సరళక్క మొహం ఎరుపురంగుకి తిరిగి గొంతు కఠినంగా అయింది. నాకు పరిస్థితి శ్రుతి మించిపోతుందని భయంకలిగింది. వున్నట్టుండి నేను కూడా రాజేశ్వరావ్ పక్షం వహించినట్టు నటించాను. ''కూల్ డౌన్ సరళక్కా ఇప్పుడు మేం అన్నమాటలు అక్షరాలా నిజమని నీకు సాయంత్రానికల్లా సవాలక్ష ఋజువులు చూపించి మీ చేతే ఒప్పిస్తాం సరేనా... పదపండి ఈశ్వరావ్ గారూ!...

వారం రోజుల బట్టీ నా మెదడు తినేస్తున్నాడు మా శిష్యం. వాళ్ళ ముట్టాల పిల్లలకి సరళక్క వాళ్ళ స్కూల్లో సీటు కావాలిట. చాలా తక్కువ టైంలోనే మంచి పేరు సంపాదించుకుంది ఆ స్కూలు.

సాయంత్రం అయితే తప్పకుండా తోటలో దొరుకుతుంది. చెట్టు క్రింద తిన్నెమీద చెక్కిట చేయి చేర్చి దీర్ఘాలోచనలో వుంది సరళక్క. (పున్నాగ పూలు తలమీంచి భుజం మీదికి జారి ఒళ్ళో పడుతున్నాయ్.) బాగా సమీపంగా వెళ్ళినా నన్ను గమనించనే లేదు.

''ఏం అక్కా... బావగారొస్తున్నానని ఉత్తరం రాశారా ఏమిటి?'

'వు.. వులికిపాటుతో ఇటు తిరిగింది. 'కూర్చో సిద్ధూ..'

''ఏదో చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నారు. చెప్పకూడనిదైతే వద్దులెండి''

''చెప్పకూడనిది కాదు.. నువ్వు విని తీరాల్సినదే... ఆ రోజు వాదన తప్పించుకున్నావే.. అదే... ఆడవాళ్ళ జీవితం ఎక్కడ పుట్టి ఎన్ని మెలికలు తిరిగి చివరికి ఎక్కడ అంతం అవ్తోందో... చిక్కుముడిలా...

ఎప్పటికైనా పరిష్కారం దొరుకుతుందంటావా!!

''ఈ పవిత్ర భారతదేశంలో మీ ఆడవాళ్ళ బ్రతుక్కి ఏం లోటొచ్చిందండీ... పెళ్ళవటం భయం. వేరు కాపరం పెట్టేవరకూ సత్యాగ్రహం. అంతేనా... అగ్నిసాక్షిగా పెళ్ళి చేసుకున్న ఆ మగాడి చేత సాయం.. సహకారం పేరుతో పిండి రుబ్బించటం మొదలూ... యాక్షన్‌తో సహా నేను చెప్పేవి ఏవీ సరళక్క వినటంలేదు.

ఆమెకళ్ళు శూన్యంలో చిక్కుపడి విషాదంలో ముంచి తోసినట్టు పేలవంగా వున్నాయి ఆమె చూపులు.

'అవును సిద్ధూ... బాగా చెప్పావ్.. మీ మగాళ్ళు అగ్నిసాక్షిగా ఆడదాని మెళ్ళో వేసే మూడు ముళ్ళే ఆవిడ మెడకి వుచ్చు బిగించే అధికారాన్ని మీకు హస్తగతం చేస్తున్నాయ్. అగ్నిసాక్షిగా అందుకున్న అదే చెయ్యి కట్టె పడేసి ఒంటికి నిలువునా నిప్పంటించి సజీవ దహనం చేసేస్తోంటే... అదే అగ్ని సాక్షిగా ఆహుతయిపోతోందయ్యా

— పి. పద్మజవాణి

ఆడది.''

నేను మౌనంగా తలదించుకున్నాను.

పగలూ రాత్రీ తేడా లేకుండా కాజువాలిటీలో వేరుతోన్న చమురు కంపు విగత జీవులు.

రకరకాల గాధల్ని పేర్చుకొని నిశ్శబ్దంగా సమాధి అయిపోతోన్న నిజాలు వేతలు మాం నోట్లూ... అబద్ధపు సాక్ష్యాలూ... బెయిల్ లు... చట్టాన్ని తల్ల క్రిందులు వేసే రాజకీయ ఒత్తిడులూ... నిజాయితీకి మారు పేరయిన జస్వంత్ సింగ్ లాంటి వాళ్ళకి ఎండమావుల్లోకి బదిలీలు... నా కళ్ళముందు చకచకా రీలులా తిరగసాగినాయ్. వాటిల్లోంచి లాగా సరళక్క కంఠం మృదు గంభీరంగా వినిపించసాగింది.

ఇది వరకు చెప్పాను కదూ... మా స్కూల్లో చాలా చక్కని ట్విన్స్ ఆడపిల్లలు సుషమా.. సేహారికా... వాళ్ళ అమ్మగారు వురి వేసుకుని చనిపోయారని. పిల్లలు ఈ మధ్యే మళ్ళీ స్కూలుకి వస్తున్నారు. (మా టీచర్స్ందరం వాళ్ళని చాలా ప్రేమగా చూస్తున్నాం.) ఇవాళ మధ్యాహ్నం క్లాసు జరుగుతోంటే ఒక పెద్దావిడ మెల్లగా వచ్చి గుమ్మానికి ఆనుకుని పిల్లల్ని చూస్తూ నిలబడ్డారు. పిల్లలు ఆవిడని చూస్తూనే మట్టేసుకుని గోలు గోలున ఏడ్చారు. ఆవిడ కడుపు శోకం మిగిల్చిన వ్యథతో నిలబడ్డానికి కూడా శక్తి లేనట్టుగా నేలమీద కూలబడిపోయారు.

"చూశారా టీచరుగారూ!... నా బిడ్డకి M.A.చెప్పించి మరీ పెళ్ళి చేశాం. ముత్యాల్లాంటి బిడ్డలు పుడితే ఆనందపడ్డాం. చివరకి.. చివరికి... ఈ ముసలి వయసులో మమ్మల్ని ... ఈ పసికాయల్నీ వదిలేసి... ఎంత నిర్దాక్షిణ్యంగా వెళ్ళిపోయిందో చూశారా..." అని పండు ముత్తయిదువ ఆవిడ ఏడుస్తోంటే ... నాకూ దుఃఖం ఆగలేదు..."

"ఎందుకని వురేసుకుంది ఆవిడ..."

"భర్త ఎవరితోనో తిరుగుతున్నాడని..."

"చూశావా! అక్కా! ఆ ముసలావిడ చెప్పినట్టు ఎమ్మే చదివి ఎంత హీనంగా చావాలనుకుందో ఆ యువతి..."

"పిచ్చా!... చచ్చిపోయిన అమ్మాయి మీదకే తప్పు తోస్తున్నావా... ఆమె భర్త పరాయి స్త్రీతో తిరగటం నేరం కాదా.."

కాదని ఎవరూ అనరు. అంతగా అతగాడి ప్రవర్తన నచ్చకపోతే విడాకులు తీసుకుని స్వతంత్రంగా బ్రతకొచ్చు. ఈ ఇద్దరు పిల్లల జీవితాలూ తీర్చి దిద్ది జీవితం అంతా నిశ్చింతంగా గడిపేయొచ్చు... క్షణికావేశానికి లోనయ్... అహంకారాన్ని ఆత్మవిశ్వాసాన్ని హక్కుల కోసం పోరాటంలాగా చిత్రించుకుంటూ... కేవలం సానుభూతి కోసం ఒంటిని నిప్పెట్టుకునే అమాయకులు... చివరి క్షణాల్లో జీవించాలని ఆరాటపడటం నేనెరుగుదును. డాక్టర్... నన్ను బ్రతికించండి. నా పిల్లల కోసం బ్రతికించండి... నాకు చావాలని లేదు" అంటూ ఆక్రోసిస్తూ మరణించే ఆడవాళ్ళు నాకు పెద్ద పజిల్ లాగా తోస్తారు" నేనింకా ఏదో చెప్పబోతున్నాను.. అంతేకాదు ప్రతీ వరకట్నపు చావు వెనకాల అండగా నిలబడే ఆదే ఆడవాళ్ళూ"

వర్ధనమ్మగారూ..రాజేశ్వరరావ్ మాట్లాడు కుంటూ వస్తున్నారు.

"మీ పిల్లలిద్దరికీ పెళ్ళిళ్ళు కుదిరాయా ఆవిడ చెప్పనే లేదు...

"ఆ... ఆడది ఆదేం చెప్తుంది లెండి. గొప్పకాదు గానీ మాఇంట్లో ఆడవాళ్ళు నోరెత్తి మాట్లాడ్డం ఎరుగరు. అంత దాకా ఎందుకూ మా ఆవిడగానీ మా పిల్లలు గానీ గుమ్మందాటి యే వాటాలోకయినా వచ్చారా... కష్టమో నిష్ఠూరమో ఆడదెప్పుడూ మగాడి చాటున పడి వుండాలి గానీ..." ఆ కంఠం గర్వంతో తొణికి సలాడుతోంది.

దీనికి మూలం ఎక్కడుందో అందినట్టుగా తల పంకించింది సరళక్క. వాళ్ళ స్కూలు యాన్యువల్ ఫంక్షన్ చాలా ఘనంగా చేస్తోంది సరళక్క. రంగు రంగుల దీపాలు మిలమిలా మెరుస్తూ మనోహరంగా వుంది స్కూలు ఆవరణ. జనం క్రిక్కిరిసినట్టుగా వున్నారు. LKGనించి పదవతరగతి వరకూ వున్న ఆ స్కూలు త్వరలో జూనియర్ కాలేజీ కాబోతోందని అందరి హర్షధ్వానాల మధ్య ప్రకటించి ముగ్ధ మనోహరమైన చిరునవ్వుతో మైక్ చేతిలోకి తీసుకుంది.

డియర్ పేరెంట్స్,

ఈ మధ్య కాలంలో చాలా సార్లు మిమ్మల్ని కల్సుకుని మీ అభిప్రాయాలు తెల్సుకోటం మేం కొత్తగా ప్రవేశపెట్టిన కొన్ని అంశాల గురించి మీకు తెలియ చెప్పి.. ఒప్పించటం కూడా జరిగింది. ముఖ్యంగా ఈ జెట్ యుగంలో కూడా ఇంకా ఆడవాళ్ళని భోగవస్తువుగా అనుకుంటూ, ముక్కుపచ్చలారని బిడ్డల మీద అత్యాచారాలు... వివాహం చేసి పంపిన అమ్మాయిలకి కట్నాలు వేధింపులూ... కాల్చులు ఇవి ప్రతీ తల్లి వణికిస్తోన్న సమస్యలు. అయితే వీటికి కేవలం మగజాతిని నిందించి చేతులు దులిపేసుకోటం కాకుండా నిర్మాణాత్మకమైన పరిష్కారం కనుక్కొని... కనీసం... ఈ ఛాయలు... ఈరేపటి తరం చిన్నారుల మీద పడకుండా కృషి చేయటం మనందరి కర్తవ్యం.

ఆచార్య దేవోభవ అంటూ తల్లిదండ్రుల తర్వాత పెద్దలు ఇచ్చిన ఈ గౌరవ పీఠం ద్వారా నేను చేయదల్చుకున్నవి ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాను. వుదాహరణకి భరత నాట్యంతో పాటుగా కరాటే... ఆత్మ సంయమనం కోసం యోగా... శరీర శాస్త్రంతోపాటు లోకజ్ఞానం... ఎలాంటి అదనపు ఫీజు వసూలు చేయకుండా నేర్పించటం జరుగుతోంది.

మీకందరికీ ముఖ్యంగా మాతృమూర్తులకి నేను విన్నవించుకునేది ఏమిటంటే మీ మగపిల్లలతోపాటుగా ఆడపిల్లల్ని కూడా సమానంగా పెంచండి. జీవితంలో ఆర్థికంగా నిలబడగలిగే విద్య చెప్పించండి. వివాహం చేసి అత్తవారింటికి పంపే ముందు సంయమనం అలవాటు చేయండి. నేర్పుగా నలుగురితో కలిసి మెలిసి జీవితాన్ని నడిపించుకునేందుకు అవసరమైన చేయూతని అందించటం మాత్రం మర్చిపోకండి. మనింటికి వచ్చిన ఆడపిల్లని కూడా పది కాలాల పాటు బ్రతకనీయండి. మృదు గంభీరంగా... వున్న సరళక్క కంఠం పూల పరిమళంలాగా అంతటా అలముకుంటోంది. తర్వాత ఆ ఆడపిల్లలు స్టేజ్ మీద కరాటే ప్రదర్శించినా, నాట్య మయూరాలై హొయలు చిలికించినా మిలటరీ యూనిఫారంలో కవాతు తీవి కదం తొక్కినా హిందూ సితా హమారా అంటూ ఏకతా గీతాలు ఆలపించినా... పులకించి పోతూ చూస్తున్నారు ప్రేక్షకులు. నాకు మాత్రం ఆ పసిడి సిగ్గుల ముఖాల్లో వుజ్వల భవిష్యత్తులో దేశపటం కన్పిస్తోంది. రేపటి మహిళ విశ్వరూపం ఇవాళే దర్శిస్తోన్న భక్తుడిలాగా నా అంతరంగం వినమ్రమైంది. ●



## సల్మాన్ కొత్త ప్రేయురాలు

ఇటీవల సల్మాన్ ఖాన్ తన పాత ప్రేమికురాళ్ళని వదిలేసి ఇప్పుడు దివ్యభారతి వెంటపడుతున్నాడని ఒక వార్త.

సల్మాన్ ఖాన్ దివ్యభారతితో కలిసి విదేశాల్లో షోలు ఇవ్వడానికి వెళ్ళినపుడు దివ్యభారతి ఎక్కడికి వెళితే అక్కడే సల్మాన్ ఖాన్ ప్రత్యక్ష మవ్వసాగాడు. ఇప్పుడు దివ్యభారతి తన చిత్రంలో సల్మాన్ ఖాన్ని హీరో తీసుకోవాలని షరతు కూడా పెడుతుందట.